సాక్షి
నిజామాబాద్

శుక్రవారం : 23 : జూన్ : 2023



ప్రభుత్వాన్ని గద్దె దించాలి

రాష్ట్రంలో అవినీతిమయంగా మారిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.

- 8లో ▸



పరీక్షలను వాయిదా వేయండి

తెయూ పరిధిలో జూలై 4 నుంచి ప్రారంభం కానున్న పీజీ పరీక్షలను వాయిదా వేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు.

- 8లో ▸

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం
39.8 /29.7

పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

తనువు బీఆర్ఎస్.. మనసు కాంగ్రెస్

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్, టీడీపీ నుంచి వలస నాయకులే ఎక్కువగా ఉన్నారు. పార్టీలో ఉన్నప్పటికీ తమకు ఏమాత్రం ప్రాధాన్యత లేదని ఆవేదన చెందుతున్నారు. తమకు ప్రాధాన్యత ఇవ్వని పార్టీ కాకుండా కాంగ్రెస్ పార్టీ గెలవాలని కోరుకుంటున్నారు. సన్నిహితుల వద్ద తమ మనోభావాలను వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆయా నియోజకవర్గాలు, మండలాల్లో అధికారం కొద్దిమంది నాయకుల చేతుల్లోనే కేంద్రీకృతం అయిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులైతే తమకు ఏమాత్రం న్యాయం జరగడం లేదని బాహాటంగానే అంటున్నారు.

- అధికార పార్టీలో ఉంటూ హస్తం గెలుపు కోరుకుంటున్న పలువురు నాయకులు, కార్యకర్తలు
- ఆది నుంచి పార్టీలో ఉన్నవారితో పాటు వివిధ పార్టీల నుంచి వచ్చినవాళ్ల గుస్సా
- ఆయా నియోజకవర్గాల్లో కొందరి వద్దే అధికారం కేంద్రీకృతమైందంటూ గుర్రు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని వర్గాల్లో రాజకీయ చర్చలే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న అన్ని మండలాలు, మున్సిపల్ డివిజన్ల పరిధిలో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల మధ్య రానున్న ఎన్నికల ఫలితాల విషయమై ఎడతెగని విశ్లేషణలు సాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులు, శ్రేణులు మాత్రం ఎలాగైనా వచ్చేసారి తాము గెలవాలనే లక్ష్యంతో బహిరంగంగా మాట్లాడుతున్నారు. అయితే బీఆర్ఎస్‌లో ఉన్న పలువురు నాయకులు, సీనియర్ కార్యకర్తలు మాత్రం మళ్లీ గెలవాలనే ఆకాంక్షను మనస్ఫూర్తిగా వ్యక్తం చేయకపోతుండడం విశేషంగా చెప్పుకోవచ్చు. బీఆర్ఎస్‌లో కాంగ్రెస్, టీడీపీ నుంచి వచ్చిన వాళ్లే ఎక్కువగా ఉన్నారు. వీళ్లంతా సుదీర్ఘకాలం పాటు రాజకీయాల్లో ఉండి క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్నప్పటికీ తమకు ఏమాత్రం ప్రాధాన్యత లేదని ఆవేదన చెందుతున్నారు. తమకు అత్యంత నమ్మకమైన వారి వద్ద సదరు నాయకులు బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే తమకు ఏమాత్రం ప్రాధాన్యత దక్కదని, అందుకే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ గెలవాలని కోరుకుంటున్నట్లు చెబుతుండడం విశేషం. అంటే ఇక్కడ మనిషి ఒకచోట, ఆలోచన ఒకచోట అన్నమాదిరిగా.. బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ గెలవాలని కోరుకుంటుండడం గమనార్హం. కాంగ్రెస్, టీడీపీల్లో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో స్థానికంగా వెలుగు వెలుగుతూ అందరికీ అందుబాటులో ఉన్నామని, మళ్లీ అలాంటి పరిస్థితి రావాలంటే తాము ఉన్న బీఆర్ఎస్ గెలవకూడదని కోరుకుంటుండడం విశేషంగా చెప్పుకోవచ్చు. తమకు ప్రాధాన్యత దక్కనప్పుడు ఇందులో ఉండి ఏం లాభమని అంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆయా నియోజకవర్గాలు, మండలాల్లో అధికారం కొద్దిమంది నాయకుల చేతుల్లోనే కేంద్రీకృతం అయిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైరవీలు, భూదందాలు సహా తదితర వ్యవహారాల్లో ఆయా మండలాల్లో ఒకరిద్దరు నాయకులదే హవా నడుస్తోందని అనేకమంది నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఇక స్థానిక ప్రజాప్రతినిధులు అయితే తమకు ఏమాత్రం న్యాయం జరగడం లేదని బాహాటంగానే అంటున్నారు. జిల్లాలో పలువురు సర్పంచులు బిల్లులు రావడంలేదని ఆత్మహత్యాయత్నాలకు సైతం పాల్పడిన ఘటనలు ఉన్నాయి. జిల్లాలో కల్లెడ సర్పంచ్ లావణ్య ప్రసాద్‌గౌడ్ దంపతులపై కేసులు పెట్టిన వైనంపై స్థానిక ప్రజాప్రతినిధులు గుస్సాగా ఉన్నారు. ఇక జిల్లాలో వివిధ మండలాల్లో బీఆర్ఎస్‌లో వర్గాలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు కొన్ని వర్గాలను ప్రోత్సహించి తమ విషయంలో పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు వివిధ అంశాల్లో నటిస్తున్నారని, తాము కూడా నటించాల్సి వస్తోందని పలువురు బీఆర్ఎస్ నాయకులు సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారని సమాచారం. మరోవైపు తమను గాలికి వదిలేసిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నాయకుల్లో కొందరికి అన్నిరకాలుగా సహకరిస్తూ కోవర్టు వ్యవహారాలు నడపడం పట్ల బీఆర్ఎస్‌లో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్‌లో ఆది నుంచి ఉన్న ఉద్యమకారులు మాత్రం తమ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉందని చెబుతున్నారు.

- రైతు రుణమాఫీ విషయంలో ఈసారి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పలువురు బీఆర్ఎస్ నాయకులే అంటుండడం గమనార్హం. ఇందులో భాగంగా పలువురు రుణాలను సైతం ఎక్కువ మొత్తంగా తీసుకుంటుండడం విశేషం. కాంగ్రెస్ వస్తే రుణమాఫీ వస్తుందని రైతులతో పాటు సదరు బీఆర్ఎస్ నాయకులు సైతం విశ్వసిస్తుండడం ఆలోచింపజేస్తోంది. మరోవైపు ధరణి సమస్యల విషయంలోనూ కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. డబుల్ ఇళ్ల విషయమై నిలదీయాలని ప్రజలను ప్రోత్సహిస్తుండడంతో పాటు, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయమై ఆలోచించాలని యువతకు చెబుతున్నారు. మొత్తంమీద గతంలో కాంగ్రెస్, టీడీపీల్లో సుదీర్ఘకాలం పాటు పనిచేసి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ గెలవాలంటూ వివిధ చర్చల్లో ఆకాంక్షలు వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



ధర్నాచౌక్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి : దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పది తలాల కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి ఫక్రుద్దీన్ హాజరయ్యారు. అనంతరం తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడితే ప్రజల జీవితాలు బాగుపడుతాయని భావిస్తే.. కేసీఆర్ కుటుంబం బాగుపడిందన్నారు. ఎన్నికల హామీలను కేసీఆర్ ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తెరిపిస్తామని ఎన్నికలలో వాగ్దానం చేసిన కేసీఆర్ ఇంత వరకు తెరువలేదన్నారు. రాబోయ్యే రోజుల్లో కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి రాజారెడ్డి, సయ్యద్ ఖైసర్, వేణు రాజ్, రాజనరేందర్ గౌడ్, తంబాకు చంద్రకళ, పోల ఉష, సంతోష్, కేశ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మారని తీరు

- వీల్‌చైర్‌పై వాటర్ బాటిల్
- నడుచుకుంటూ వెళ్లిన ఆపరేషన్ అయిన బాలుడు



నడుచుకుంటూ వెళ్తున్న బాలుడు, పక్కన వీల్‌చైర్‌పై వాటర్ బాటిల్

నిజామాబాద్ సిటీ : జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్ల పట్ల సిబ్బంది తీరు మారలేదు. ఆపరేషన్ అయిన బాలుడు ఇంటికి వెళ్తుండగా కేర్ టేకర్లు కనీసం పట్టించుకోలేదు. నిజామాబాద్ నగరానికి చెందిన పదేళ్ల బాలుడికి కడుపులో నొప్పి రావడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. గురువారం బాలుడిని డిశ్చార్జి చేశారు. ఆస్పత్రి గేట్ వరకు వీల్‌చైర్‌లో తీసుకెళ్లవలసిన పేషంట్ కేర్ టేకర్ ఎవరూ అందుబాటులో లేకపోవటంతో బాలుడిని తల్లి గేట్ వరకు నడిపించుకుంటూ తీసుకెళ్లింది. అదే సమయంలో వీల్‌చైర్‌లో ఆస్పత్రి సిబ్బంది వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లటం కనిపించింది. ఆస్పత్రిలో కేర్ టేకర్లు, వీల్‌చైర్లు ఉన్నప్పటికీ ఉపయోగం లేదని పేషెంట్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఆస్పత్రి వైద్యులు నాణ్యమైన సేవలందిస్తూ గుర్తింపు పొందుతుంటే సిబ్బంది మాత్రం రోగులతో ఇలా ప్రవర్తిస్తున్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్



విషయం: వర్షాల ఆలస్యంతో ఏ సమయంలో విత్తనాలు, వరినాట్లు వేయాలి. ఎరువులు, విత్తనాల లభ్యత. నకిలీ విత్తనాల సరఫరా, వరి నారుమడుల్లో సమస్యలు, తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడగవచ్చు.

తేది : 24-06-2023 (శనివారం)

సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: 72888 94567, 99594 12852

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వెరిఫికేషన్



ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం కొనసాగింది. 616 మంది అభ్యర్థులకు 562 మంది వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. ప్రక్రియను అదనపు డీసీపీ (ఏఆర్) గిరిరాజు పరిశీలించారు. పరిపాలన అధికారి (ఏఓ) శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్ పాల్గొన్నారు.

లక్ష్మాపూర్ శివారులో ఎలుగుబంటి సంచారం

రుద్రూర్ : చందూర్ మండలం లక్ష్మాపూర్ శివారులో మూడు రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుండడంతో స్థానికులు భయపడుతున్నారు. ఎలుగు బంటి రాత్రి వేళ కారేగాం పల్లె, లక్ష్మాపూర్ శివారులోకి వచ్చి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. సర్పంచ్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ శివారులోకి రాకుండా రాత్రివేళ పటాకులు కాలుస్తున్నారు. గస్తీ దళాలుగా ఏర్పడి కాపలా ఉండాలని నిర్ణయించినట్లు సర్పంచ్ తెలిపారు. ఏడాది క్రితం గ్రామానికి చెందిన మహిళపై ఎలుగు బంటి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. మళ్లీ ఇప్పుడు ఎలుగు సంచరిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎలుగు బంటి కోసం బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్టు అధికారులు చెప్పినట్లు సర్పంచ్ తెలిపారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ సిటీ : జిల్లాలో వివిధ బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నాలుగు బస్తీ దవాఖానాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టులను ఎన్‌హెచ్‌ఎం ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు దరఖాస్తులను ఈ నెలా 22 నుంచి 28 వరకు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంబీబీఎస్ చదివి, టీఎస్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రార్ అయిన వారు అర్హులని, నెలకు జీతం రూ.52 వేలు ఉంటుందని వివరించారు. దరఖాస్తులను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్త కలెక్టరేట్‌లోని రూం నంబరు 201లో అందజేయాలని సూచించారు. దరఖాస్తు ఫారం, గైడ్‌లైన్స్ కోసం nizamabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది డిబార్

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో విద్యార్థుల డిబార్లు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ 50 మంది వరకు విద్యార్థులు డిబార్ అయ్యారు. గురువారం జరిగిన పరీక్షల్లో 12 మంది డిబార్ అయినట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 5,486 మంది విద్యార్థులకు 5,211 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షకు 4,627 మంది విద్యార్థులకు 4,261 మంది పరీక్ష రాశారని కంట్రోలర్ తెలిపారు.

డెత్ ఓటర్ల ఏరివేత

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మరణించిన ఓటర్ల ఏరివేత కార్యక్రమం ప్రారంభించారు. నగరంలోని 60 డివిజన్లలో బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. ఐదు వేలకు పైగా మరణించిన వ్యక్తుల ఓట్లు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించి జాబితా సిద్ధం చేశారు. రెండు రోజులుగా సిద్దిపేట్ నుంచి వచ్చిన నలుగురు ప్రత్యేకాధికారులు ఈ జాబితాను పరిశీలిస్తున్నారు.

ఎమ్మెల్యేపై హత్యాయత్నం కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్

బోధన్‌టౌన్ (బోధన్) : ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌పై హత్యాయత్నం కేసును పోలీసులు వేగవంతం చేశారు. బోధన్ పట్టణంలోని రెంజల్ బేస్ కాలనీలో వారం రోజుల క్రితం పాఠశాల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వెళుతున్న ఎమ్మెల్యేను ఎంఐఎం నాయకులు అడ్డుకొని హత్యాయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. గురువారం రిమాండ్‌లో ఉన్న ఎంఐఎం నాయకులు అల్తాఫ్, నవీద్‌లను పోలీసులు కస్టడీలోకి తీసుకొని సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా ఇద్దరిని రెంజల్ బేస్ కాలనీతో పాటు వారు ఎక్కడెక్కడ తిరిగారో అక్కడ తిప్పారు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ వివరాలు వెల్లడించారు.

నివాళి



నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మేయర్ నీతూకిరణ్ తదితరులు

అమరుల కుటుంబాలను గౌరవించాలి

- అమరుల సంస్మరణ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసుకున్న అమరుల త్యాగాలు స్మరించుకోవడానికే సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా, అధికారులు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ కోసం త్యాగం చేసిన వారి కుటుంబాలను గౌరవించుకోవడం కోసమే కార్యక్రమం చేపట్టామన్నారు. ఉద్యమంలో జిల్లాలో 32 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని, వారి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున నగదు అందించామని, 30 మందికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించామన్నారు. మరో రెండు కుటుంబాలకు కూడా ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 21 రోజుల పాటు గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అండగా సీఎం కేసీఆర్

ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదుకుంటున్నారని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు అన్నారు. 2001 నుంచి కేసీఆర్‌తో అడుగులో అడుగు వేసి ఉద్యమంలో పాల్గొన్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల సహకారంతో తెలంగాణ సాధించి 9 ఏళ్లలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ

అమరుల త్యాగంతోనే తెలంగాణ ఏర్పడిందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నిజామాబాద్ నగరంలో 8 మంది యువకులు ఆత్మబలిదానం చేసుకున్నారని గుర్తుచేశారు. వారి లోటు మరువలేనిదని, బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల నగదు అందజేసి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించామన్నారు. మేయర్ నీతూకిరణ్ మాట్లాడుతూ అమరవీరులను స్మరించుకోవడం, వారి కుటుంబాలను సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఉద్యోగ సంఘాల నాయకులను విస్మరించడం సరికాదని, కార్యక్రమ సమాచారం, ఆహ్వానం అందలేదని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ పేర్కొన్నారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల, కలెక్టర్

నిధుల కోసం నిరీక్షణ

- 11 నెలలుగా అందని ఆర్థిక సంఘం నిధులు
- మూణ్నెళ్లుగా జమకాని ఎస్ఎఫ్‌సీ ఫండ్
- గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు బ్రేక్!



సుభాష్‌నగర్ : గ్రామ పంచాయతీల్లో నిధుల కటకట నెలకొంది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 కోట్ల వరకు పెండింగ్‌లో ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్ఎఫ్‌సీ, ఆర్థిక సంఘం నిధులు మరో రూ.30 కోట్లు జమ కావాల్సి ఉంది. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కూడా రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలకు రూ.1150 కోట్లు విడుదల చేస్తున్నామని ప్రకటించిన నాటి నుంచి సర్పంచులు నిధుల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఒక్కో నెల పంచాయతీ కార్మికులు, సిబ్బంది జీతాలను కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అప్పులు తెచ్చి అరకొర వేతనాలు చెల్లిస్తున్నారు.

వేతనాలకూ ఇబ్బందులు

జిల్లావ్యాప్తంగా 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన ప్రతినెలా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, 15వ ఆర్థిక సంఘం నుంచి పంచాయతీ ఖాతాల్లో నిధులు జమయ్యేవి. ఈ నిధులతోనే పంచాయతీలో అభివృద్ధి పనులతో పాటు సిబ్బంది, కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు, ఇతరత్ర ఖర్చులు చెల్లించేవారు. ఇప్పటికే అన్ని జీపీల్లో అప్పులు తెచ్చి పనులు కొనసాగిస్తున్నారు. ఒక్కో నెల వేతనాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచులు వాపోతున్నారు.

తప్పని ఎదురుచూపులు

ఎస్ఎఫ్‌సీ, ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయని రోజుల తరబడి సర్పంచులు, కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సర్పంచులు అప్పులు తెచ్చి కార్మికులు, సిబ్బంది జీతాలు చెల్లిస్తున్నారు. పంచాయతీల్లో చిన్న చిన్న పనులకు కూడా డబ్బులను సర్దుబాటు చేస్తున్నారు. అలాగే గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు సైతం బిల్లుల కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికే చాలా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. జీపీ ఖాతాల్లో జమ అయిన నిధులకు కూడా ఫ్రీజింగ్ చేయడంపై సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రెజరీలో ఒక్క చెక్కు కూడా పాస్ కావడం లేదని వాపోతున్నారు. అభివృద్ధి పనుల బిల్లులు సహా పంచాయతీలకు మొత్తం రూ.100 కోట్లకుపైగా రావాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

రూ.45 కోట్ల బకాయిలు..

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధుల కోసం సర్పంచ్, ఉపసర్పంచ్ జాయింట్ ఖాతాతో డిజిటల్ టోకెన్ ప్రక్రియను 13 నెలల క్రితమే పూర్తిచేసింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.15కోట్ల వరకు రావాల్సి ఉంది. అలాగే ఎస్ఎఫ్‌సీ మూడు నెలలుగా జమ చేయడం లేదు. గతేడాదికి సంబంధించి పూర్తిగా విడుదల చేసినా.. ఈ సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి విదిల్చలేదు. గతేడాది, ఈయేడాదికి సంబంధించి ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నుంచి మొత్తం రూ.45కోట్ల వరకు జమ కావాల్సి ఉంది.

పది రోజుల్లో జమయ్యే అవకాశం



గ్రామపంచాయతీలకు పది రోజుల్లో నిధులు విడుదలయ్యే అవకాశముంది. ఆర్థిక సంఘంతోపాటు, ఎస్ఎఫ్‌సీ నిధులు కూడా జమ కానున్నాయి. ప్రభుత్వం నుంచి ఈ మేరకు సమాచారం అందింది. సర్పంచులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్న మాట వాస్తవమే. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– జయసుధ, జిల్లాపంచాయతీ అధికారి

క్లుప్తంగా

30లోపు పీజీ సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరిగే పీజీ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి ఫీజును ఈనెల 30 లోపు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో జూలై 4వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పీజీ 8వ, 10వ సెమిస్టర్ థియరీ, ప్రాక్టికల్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు సంబంధించి ఒక సబ్జెక్టుకు రూ.150లు, రెండు సబ్జెక్టులకు రూ.300లు, రెండింటి కన్నా ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.500లు ఫీజు చెల్లించాలన్నారు. ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ (ఐపీసీహెచ్), ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ పరీక్షలకు సంబంధించి ఒక సబ్జెక్టుకు రూ.175లు, రెండు సబ్జెక్టులకు రూ.350లు, రెండింటి కన్నా ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.600 ఫీజు చెల్లించాలన్నారు. ఎంబీఏ, ఎంసీఏ పరీక్షలకు సంబంధించి ఒక సబ్జెక్టుకు రూ.250లు, రెండు సబ్జెక్టులకు రూ.500లు, రెండింటి కన్నా ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.800 ఫీజు చెల్లించాలని కంట్రోలర్ తెలిపారు. పీజీ 2వ, 4వ, 6వ, 8వ, 10వ సెమిస్టర్స్ థియరీ, ప్రాక్టికల్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై, ఆగస్టు నెలలో జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని కంట్రోలర్ అరుణ తెలిపారు.

పరీక్షలను వాయిదా వేయండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జూలై 4 నుంచి ప్రారంభం కానున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు అక్షయ్ మాట్లాడుతూ.. తెయూ అప్లయిడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 8వ, 10 వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ జూలై 4 నుంచి 14 వరకు ఇచ్చారని తెలిపారు. అయితే సీపీజీఈటీ ప్రవేశ పరీక్ష జూన్ 30 నుంచి జూలై 10వరకు ఉన్నందున తెయూ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. అలాగే ఇంటిగ్రేటెడ్ మూడో సంవత్సరం విద్యార్థులు డిగ్రీ తర్వాత సెంట్రల్ యూనివర్సిటీ, ఐసెట్ లకు వెళ్లడానికి, వేరే ఇతర పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు డిగ్రీ సర్టిఫికెట్ కావాలని, దీన్ని దృష్టిలో పెట్టుకుని 6వ సెమిస్టర్ పరీక్షలు త్వరగా నిర్వహించాలని విన్నవించారు. రిజిస్ట్రార్‌తో మాట్లాడి సెమిస్టర్ పరీక్షలు వాయిదాపై నిర్ణయం ప్రకటిస్తామని కంట్రోలర్ హామీ ఇచ్చారు. నాయకులు ఆకాష్, యశ్వంత్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జీవన్ మాట్లాడుతూ.. వర్సిటీ సమస్యలు పరిష్కరించి, అకడమిక్ వాతావరణాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నవీన్, ప్రమోద్, సాయికృష్ణ, సింహాద్రి, నాగరాజు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- ఘనంగా అమరవీరుల సంస్మరణ కార్యక్రమం



జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా పరిషత్ ప్రతినిధులు, అధికారులు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల వేడుకల్లో భాగంగా గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్‌తోపాటు సభ్యులందరు అమరులను స్మరించుకున్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరుల సంస్మరణ తీర్మాణం చేశారు. అలాగే అమరుల కుటుంబాలకు సన్మానం చేశారు. అంతకుముందు నగరంలోని అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్ తదితరులు

తెలంగాణ యూనివర్సిటీలో..

తెయూ(డిచ్‌పల్లి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెయూ క్యాంపస్‌లో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఎంపీపీ గద్దె భూమన్న, ఎంపీడీవో గోపిబాబు తదితరులు ఉన్నారు.





తెయూలో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అధ్యాపకులు.. డిచ్‌పల్లి మండలంలో..

మెప్మాలో ఇష్టారీతిన బదిలీలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో ఉన్నతాధికారులు ఇష్టారీతిన బదిలీలు చేపట్టడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ బదిలీల్లో ముడుపుల బాగోతం నడిచిందని శాఖలోని ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్, భీమ్‌గల్‌లల్లో మున్సిపాలిటీల్లో మెప్మాకు సంబంధించి కమ్యూనిటీ ఆర్గనైజర్(సీవో) బదిలీలు జరిగాల్సి ఉండగా.. కేవలం నిజామాబాద్, బోధన్ మెప్మాలో మాత్రమే బదిలీలు జరిగాయి. నిజామాబాద్‌లో ఎనిమిది మంది సీవోలు ఉండగా, బోధన్‌లో ఇద్దరు సీవోలు ఉన్నారు. బోధన్ సీవో సరితపై ఆరోపణలు రావడంతో అక్కడి మున్సిపల్ కమిషనర్ సీరియస్ కావడంతో గత రెండు నెలల నుంచి ఆమె నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో బోధన్‌లో ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో గురువారం నిజామాబాద్ నుంచి ఎ శ్రీనివాస్, పి శ్రీనివాస్‌ను బోధన్‌కు బదిలీ చేశారు. అలాగే సరితను, బోధన్‌లో ఉన్న సీవో అశోక్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. జిల్లావ్యాప్తంగా బదిలీలు చేపట్టాల్సి ఉండగా, కేవలం నిజామాబాద్, బోధన్‌లో మాత్రమే బదిలీలు చేపట్టడంపై ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వివరణ కోసం 'సాక్షి' మెప్మా పీడీ రాములుకు పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు.

నయా నిజాం పాలనకు చరమగీతం పాడాలి



తెయూ(డిచ్‌పల్లి): పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న నయా నిజాం పాలనకు చరమ గీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జీవన్ పేర్కొన్నారు. ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం 'దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం – మహా ఉద్యమం' అనే సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జీవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, విద్యార్థి, నిరుద్యోగ ప్రజా వ్యతిరేఖ పాలనపై ప్రజలకు వివరించి చైతన్యం చేయాలన్నారు. విద్యారంగంతో పాటు అన్ని రంగాలలో మార్పు కోసం మహా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఇందూరు విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ ప్రమోద్, వర్సిటీ ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, నాయకులు సింహాద్రి, నాగరాజు, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నాగారం, చక్రధర్‌నగర్ తండా ప్రభుత్వ పాఠశాలలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధనపై సంబంధిత టీచర్లతో మాట్లాడారు. అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని తెలుసుకున్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

- మరొకరికి స్వల్ప గాయాలు



మాలవత్ రెడ్డి మృతదేహం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని దగ్గి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై ఓ వ్యక్తి తన కుమారుడితో కలిసి బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి బారికేడ్లను ఢీకొట్టాడు. ఈఘటనలో సదరు వ్యక్తి మృతిచెందగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్‌వాయి మండలం వెంగల్పాడ్ గ్రామానికి చెందిన మాలవత్ రెడ్డి(34) అనే యువకుడు తన మేనమామ చంద్రును సదాశివనగర్ మండలం యాచారంలో దింపి, తన కుమారుడు నితిన్‌ను తీసుకొని బైక్‌పై వెంగల్పాడ్‌కు బుధవారం రాత్రి బయలుదేరాడు. దగ్గి శివారులోని జాతీయ రహదారిపై వీరి బైక్‌ను అతివేగం, అజాగ్రత్తతో నడిపడం వల్ల అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బారికేడ్లను ఢీకొట్టాడు. దీంతో మాలవత్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు నితిన్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడు హెల్మెట్ ధరించి ఉంటే మరణించేవాడు కాదని పోలీసులు పేర్కొంటున్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరపుతున్నట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గణేష్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎల్లారెడ్డికి చెందిన అతినారపు సాయిలు (70) బుధవారం బైక్‌పై పోచారం నుంచి వస్తుండగా సబ్దల్‌పూర్ శివారులో ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సాయిలును హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించగా గురువారం చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి రైల్వేస్టేషన్ వద్ద కదులుతున్న రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ప్రణయ్ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామని, వివరాలకు నిజామాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

పావురాల కోసం కత్తులతో దాడి

- ఇరువురికి గాయాలు

ఖలీల్‌వాడి: పావురాలను ఎత్తుకెళ్లారని సదరు వ్యక్తి ఇంటి వెళ్లి, వారిపై దాడికి పాల్పడిన ఘటన నగరంలో గురువారం చోటుచేసుకుంది. ఆరో టౌన్ ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని ఆటోనగర్‌లోని న్యూబిడ్జ్ ప్రాంతంలో షేక్ సమీర్ అనే వ్యక్తి పిల్లులు, పావురాలను పెంచుకుంటున్నాడు. అతడి పావురాలను ఆదే బస్తీలో ఉన్న మోయిజ్ కొడుకు ఎత్తుకెళ్లినట్లు భావించారు. ఈ విషయమై షేక్ సమీర్ తన ఇద్దరి స్నేహితులతో కలిసి మోయిజ్ ఇంటికి వెళ్లి, మాట్లాడుతుండగా మోయిజ్ మా ఇంటికి వస్తారా అంటూ సమీర్‌ను ఇష్టం వచ్చినట్లు కొట్టారు. మోయిజ్ తన స్నేహితులైన అమీర్, మల్లాను పిలిపించుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అమీర్ తన చేతిలోని కత్తితో సమీర్‌పై దాడి చేయగా కుడి చేతికి గాయాలయ్యాయి. వెంటనే సమీర్ కత్తిని లాక్కొని అమీర్‌పై దాడి చేయగా కుడి చేతికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

దోమకొండ: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురికి గురువారం కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ 2రోజుల జైలుశిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ దోమకొండకు చెందిన నవీన్, కాశీం, లింగం, సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన సురేష్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా, జడ్జి శిక్ష విధించినట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలంలో ఓ మైనర్ బాలికపై అత్యాచారం ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తండ్రి బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లగా బాలిక తన తల్లితో ఉంటోంది. ఈ నెలా 14న రాత్రి పెండ్లి బరాత్ జరుగుతుండగా గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలుడు అదే గ్రామానికి చెందిన 10 సంవత్సరాల బాలికను మాయమాటలు చెప్పి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. అనంతరం జరిగిన విషయం గురించి బాలిక తన తల్లికి చెప్పటంతో ఆమె నివ్వెరపోయింది. కాగా గ్రామంలో జరిగిన ఘటనపై గురువారం గ్రామపెద్దలు పంచాయతీ నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు, రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. వీరిని చూసిన పెద్దలు అక్కడి నుంచి జారుకున్నారు. అధికారులు బాలిక తల్లిని కలిసి జరిగిన ఘటనపై వివరాలు సేకరించారు. అనంతరం బాలికకు వైద్య పరీక్షల నిమిత్తం నిజామాబాద్ సఖీ సెంటర్‌కు తరలించారు. పోలీసులు బాలుడిపై కేసు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు తరలించినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కొనారెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చే యగా, పేకాడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9260 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భిక్కనూరు: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న బొబ్బిలి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలినట్లు పోలీసులు గురువారం రాత్రి తెలిపారు. చెరువులో మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆనంద్‌గౌడ్ తన సిబ్బందితో చెరువు వద్దకు వచ్చి పరిశీలించగా చెరువు మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతూ కన్పించింది. చీకటి పడడంతో శుక్రవారం ఉదయం మృతదేహన్ని ఒడ్డుకు తీసుకవస్తామని పోలీసులు తెలిపారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలి



పెర్కిట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అర్వింద్

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో అవినీతిమయంగా మారిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, ఆర్మూర్ పట్టణంలోని 7, 29 వార్డులలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణలో రాబోయేది బీజేపీ సర్కారు అన్నారు. అనంతరం పీఎం మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, కరపత్రాలను అందజేశారు. నాయకులు జీవీ నర్సింహ రెడ్డి, జెస్సు అనిల్, రోహిత్ రెడ్డి, ఖాందేశ్ ప్రశాంత్, కౌన్సిలర్ సాయి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ పాలన స్వర్ణయుగం



44వ డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: కేంద్రంలోని బీజేపీ పాలన ప్రజానికానికి స్వర్ణయుగమని, అనేక సంక్షేమ పథకాలు అమలుజేస్తూ అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం నగరంలోని 44వ డివిజన్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ 39వ డివిజన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి 5వ డివిజన్‌లో ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. 9090902024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పిస్తూ మద్దతు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని తెలిపారు. మరో 20 ఏళ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం ఖాయమన్నారు. రాష్ట్రంలోనూ వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. నాయకులు శీలశ్రీనివాస్, మీసేవా శ్రీనివాస్, పాండు, నరేష్, సుమన్, ఓంప్రకాశ్, హరీష్, మారుతి, వినయ్, వినోద్, వంశీకృష్ణ, సాయిలు పాల్గొన్నారు.

సీనియారిటీ విషయమై లెక్చరర్ల మధ్య గొడవ

నిజామాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల వాల్యుయేషన్‌లో సీనియారిటీ విషయమై మోడల్ కళాశాల లెక్చరర్లకు, కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు గొడవ జరిగింది. నగరంలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో గురువారం వాల్యుయేషన్ ప్రారంభం కాగా, మోడల్ స్కూల్ కళాశాలల లెక్చరర్లకు సీఈలుగా విధులు నిర్వహించడానికి ఉత్తర్వులు ఇవ్వొద్దని కొందరు కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిని అభ్యర్థించారు. మోడల్ కళాశాలల్లో 10 సంవత్సరాల అనుభవం ఉన్న తాము వ్యాల్యుయేషన్ చేయడానికి అర్హులమన్నారు. మూడు సంవత్సరాల అనుభవం ఉన్న జూనియర్ లెక్చరర్లకు సీఈలుగా నియమించవద్దన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య అరగంటసేపు గొడవ జరిగింది. దీంతో ఇంటర్మీడియట్ అధికారి రఘురాజ్ స్పందించి, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని సిబ్బందికి వాల్యుయేషన్ విధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



జోడు లక్ష్మణ్ (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలోని బొల్లారం శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు లక్ష్మణ్(28)కు గత ఐదేళ్లక్రితం లింగంపేట మండలం ఎక్కపల్లి గ్రామానికి చెందిన రజితతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా లక్ష్మణ్ తన భార్య, పిల్లలతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. కాగా రెండురోజుల క్రితం ఎక్కపల్లిలో జరిగిన బోనాల పండుగకు లక్ష్మణ్ తన భార్య, పిల్లలతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో లక్ష్మణ్ తన తల్లి లక్ష్మికి బుధవారం రాత్రి ఫోన్ చేసి ఆర్థికసమస్యల కారణంగా కుటుంబంలో గొడవలతో జీవితంపై విరక్తి చెంది బొల్లారం శివారులో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం బుధవారం రాత్రి బొల్లారం శివారులో గాలించారు. గురువారం ఉదయం లక్ష్మణ్ బొల్లారం శివారులోని చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ఇంజినీరింగ్ కళాశాలలో చోరీ

- రూ. 7.50లక్షల అపహరణ

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ వద్ద గల కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధ వారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరబడి రూ.7.50 లక్షలు అపహరించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. కళాశాల యాజమాన్యం తమ సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు బుధవారం రూ: 7. 50లక్షలు కళాశాలకు తీసుకువచ్చారు. చెల్లింపులను గురువారానికి వాయిదా వేసుకోవడంతో డబ్బులను కళాశాలలోని స్టాఫ్ గది బీ రువాలో పెట్టివెళ్లారు. అర్ధరాత్రివేళ గుర్తుతెలియని దుండగులు కళాశాల వెనుక భాగం నుంచి వచ్చి గది తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళాలను కూడా బద్దలుకొట్టి అందులో ఉన్న రూ: 7.50 లక్షలను అపహరించుకపోయారు. గురువారం ఉదయం కళాశాలకు వచ్చిన సిబ్బంది చోరీని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ సిబ్బందితో కలిసి కళాశాలకు చేరుకొని విచారణ ప్రారంభించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

పార్ట్‌టైం జాబ్ పేరిట సైబర్ మోసం

- రూ.1.13లక్షలను కాజేసిన ఆన్‌లైన్ మోసగాళ్లు

కామారెడ్డి క్రైం: పార్ట్ టైం జాబ్ పేరిట ఓ మహిళ సైబర్ మోసానికి గురై, రూ. 1.13 లక్షలను పోగొట్టుకున్న ఘటన జిల్లా కేంద్రంలో గురువారం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. కామారెడ్డికి చెందిన సుమయా ఫిర్దోస్ అనే గృహిణికి ఈనెల 5న గుర్తుతెలియని వ్యక్తులు టెలిగ్రామ్ మెసేజ్ చేశారు. పార్ట్ టైం ఉద్యోగం పేరిట నమ్మించారు. మొదట వందల్లో కట్టించుకుని లాభంతో కూడిన మొత్తం వేసి నమ్మించారు. దీంతో వారు చెప్పినట్లు చేస్తూ ఆమె విడతల వారీగా మొత్తం రూ.1.13 లక్షలు చెల్లించింది. చివరికి మోసపోయినట్లు గ్రహించి పట్టణ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్ తెలిపారు.

మంజీరలో యువకుడి గల్లంతు



ఏసు (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోలిలింగాల గ్రామశివారులో గల మంజీరనదిలో గురువారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని వాడి గ్రామానికి చెందిన బాలలింగం ఏసు(22) అదేగ్రామానికి చెందిన మరో యువకుడితో కలిసి మంజీరనదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. కాగా నదిలో లోతు ఎక్కువగా ఉండడంతో ఏసు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న ఏసు కుటుంబసభ్యులు, స్థానికులు మంజీరనదికి చేరుకొని ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది, నాగిరెడ్డిపేట పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రి వరకు ఏసు ఆచూకీ లభ్యం కాలేదు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



ఆర్మూర్‌లో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఆర్మూర్ ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం అరెస్టు చేశారు. ఆర్మూర్ నుంచి మునిపల్లి వరకు రూట్ వాచ్ నిర్వహిస్తుండగా రంజన్ కుమార్, దొండ శివ కుమార్ 750 గ్రాముల గంజాయిని తరలిస్తూ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. నిందితులను పట్టుకున్న వారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, ఆర్మూర్ సీఐ స్టీవెన్‌సన్, ఎస్సైలు ప్రమోద్ చైతన్య, చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. హోటల్ సిబ్బందిపై కేసు

కామారెడ్డి టౌన్: ఓ యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటనలో హోటల్ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఇంటర్నేషనల్ బార్ అండ్ రెస్టారెంట్‌కి బుధవారం రాత్రి నలుగురు యువకులు వచ్చి మద్యం తాగారు. గ్లాస్ కిందపడిపోయిన విషయంలో హోటల్ సిబ్బందితో వాగ్వాదం చోటు చేసుకుంది. స్నేహితులు మాట్లాడుతుండగానే వినయ్‌కుమార్ అనే యువకుడు కిందికి వెళ్లాడు. దీంతో రెస్టారెంట్ సిబ్బంది అతడిని పట్టుకుని చితకబాది, కొద్దిదూరం రోడ్డుపై ఈడ్చుకుంటూ బార్ ముందు పడేశారు. ఈ ఘనటపై బాధితుడి ఫిర్యాదు మేరకు బార్ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.